పర్యావరణ మనుగడకు పెను సవాళ్లు

- ప్రతి ఒక్కరూ కలిస్తేనే జయించగలం
- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): పర్యావరణ మనుగడకు ఎదురవుతున్న పెనుసవాళ్లను జయించడానికి ప్రతి ఒక్కరూ తమ జీవనశైలిని మార్చుకుని పనిచేయాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అటవీశాఖ ఆధ్వర్యంలో మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలో నిర్వహించిన మిషన్ లైఫ్ 2023–28 కార్యక్రమంలో భాగంగా సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచ దేశాలు పర్యావరణంలో వస్తున్న మార్పులపై తద్వారా జనజీవితాలపై పడే ప్రభావాలను గుర్తించి పర్యావరణ పరిరక్షణకు అవసరమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో 1972 నుంచి ఇందుకోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. వాతావరణంలో వచ్చే మార్పులు ప్రజల జీవితాలపై ప్రభావం చూపుతాయన్నారు. కాలుష్య రహితంగా తమ పరిసరాలను చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరుపై ఉందన్నారు. తక్కువ దూరం రాకపోకలకు సైకిల్ వినియోగించడం, వీలైతే నడవడం, నివాసాలు, పాఠశాలలు, కార్యాలయాల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం, తదితర భవిష్యత్ కార్యక్రమాలు అలవర్చుకోవాలన్నారు. ప్రతి ఇంటి ఆవరణలో ఒక మొక్కలతో పాటు ఔషధ మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సోలార్ ఎనర్జీ వినియోగంపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం అటవీశాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు అటవీశాఖ అధికారి రామకొండారెడ్డి, ఆత్మకూరు సబ్ డివిజన్ అటవీశాఖ డీఆర్‌ఓలు పిచ్చిరెడ్డి, రవీంద్రబాబు, రాజశేఖర్‌గౌడ్, నరసింహారావు, అటవీశాఖ బీట్ ఆఫీసర్లు, బేస్ క్యాంపు సిబ్బంది, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సోమల మాధవరెడ్డి, మాజీ అధ్యక్షులు చెన్ను శ్రీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు కన్నపురెడ్డి అమర్‌నాథ్‌రెడ్డి, ముటుకుందు లక్ష్మీరెడ్డి, గోపవరం కాంతారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు అబ్దుల్లా పాల్గొన్నారు.

ప్రకృతి సమతుల్యతతోనే పర్యావరణం

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ప్రకృతి సమతుల్యతను పాటించడం ద్వారా పర్యావరణం పెరుగుతుందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిఅన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని కావలి అటవీశాఖ ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం జరిగిన ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం స్థానిక అటవీశాఖ కార్యాలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మన పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం మన కనీస బాధ్యత అని చెప్పారు. మనం చేసే పనుల వలనే అనేక అనర్థాలకు కారణమవుతోందని, ప్రకృతి విధ్వంసం జరుగుతుందన్నారు. పర్యావరణ కాలుష్యాన్ని నివారించడం మన చేతుల్లోనే ఉందన్నారు. ప్రధానంగా ఇంధనం వాడకాన్ని తగ్గించాలని. కాలుష్యాన్ని ఉత్పత్తి చేసే వస్తువుల వాడకం తగ్గించాలని, ముఖ్యంగా ప్లాస్టిక్స్ వాడకాన్ని తగ్గించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్స్ భూమిలో కొన్ని వేల సంవత్సరాలైనా కూడా విలీనం కావన్నారు. ప్రకృతి కాలుష్యంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. మనం వదిలే కలుషిత గాలి వల్ల కూడా ఎంతో కాలుష్యం ఉత్పత్తి జరుగుతోందన్నారు. దీనిని నివారించాలంటే చెట్లను పెంచాలన్నారు. ప్రతి ఒక్కరూ మీ ఇంటి దగ్గరే చెట్లు నాటాలని ఎమ్మెల్యే ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నివారణతో పర్యావరణం మెరుగు

కావలి: ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని నివారించడం ద్వారా పర్యావరణం మెరుగు పడుతుందని స్థానిక కళాశాల ప్రధానాచార్యులు ఎస్. ఇందిరా అనిల్‌కుమారి తెలిపారు. మండలంలోని ఒట్టూరులో ఉన్న ఆంధ్రప్రదేశ్ ఆదర్శ ఉన్నత పాఠశాల, కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి, ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ సంయుక్త ఆధ్వర్యంలో కో ఆర్డినేటర్ జేవీ రమేష్ ఆధ్వర్యంలో జరిగింది. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. తొలుత కళాశాల ఆవరణలో విద్యార్థులు, అధ్యాపకులు మొక్కలు నాటారు. విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై పెయింటింగ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఆఫ్ కాస్ట్ బృందం తరపున ప్రభాకర్, ఆఫ్ కాస్ట్ రిసోర్స్ పర్సన్ పర్యావరణ దినోత్సవంపై అవగాహన కల్పించారు. పోటీల్లో ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రశంసా పత్రాలు అందించారు.

చుక్కల భూముల సమస్య పరిష్కారం



రైతుకు పట్టా అందజేస్తున్న తహసీల్దార్

చేజర్ల: ఎన్నో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న రైతులకు చుక్కల భూముల సమస్య పరిష్కామైంది. జిల్లాలోనే చేజర్ల మండలంలో అత్యధిక చుక్కల భూములు ఉన్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూములకు చుక్కలను 163 జీఓ ప్రకారం తొలగించడంతో చేజర్ల మండల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తహసీల్దార్ శివకృష్ణయ్య సోమవారం పాడేరుకు చెందిన రైతు బండ్ల రామాంజనేయులకు 13 ఎకరాలకు సంబంధించి పట్టాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 18 రెవెన్యూ గ్రామాల్లో 3,400 ఎకరాల్లో చుక్కల భూములకు సంబంధించి పట్టాల పంపిణీకి సిద్ధం చేశామన్నారు. పాస్‌పుస్తకాలు లేనివారు వాటి కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండలంలోని వీఆర్వోల ద్వారా మంగళవారం నుంచి రైతులకు పట్టాల పంపిణీ చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో సిమెంట్ రోడ్డు

ఆత్మకూరు: పట్టణంలోని 7వ వార్డులో కౌన్సిలర్ సయ్యద్ నౌషాద్‌బేగం సిమెంట్ రోడ్డు పనులను సోమవారం ప్రారంభించారు. ఇటీవల ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించినప్పుడు ఆయన దృష్టికి వచ్చిన పలు సమస్యలను పరిశీలించి అంతర్గత సిమెంట్ రోడ్లను మంజూరు చేయించారు. ఎమ్మెల్యే చొరవతో నిధులు మంజూరు అవ్వడంతో తూర్పువీధిలోని అంతర్గత సిమెంటు రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సయ్యద్ జమీర్ తదితరులు పాల్గొన్నారు.

మా పాలనలో సంక్షేమం, అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ సంపూర్ణమ్మ

చేజర్ల (సోమశిల): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఒక్క కుటుంబానికి సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని అనంతసాగరం ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ అన్నారు. మండల పరిషత్‌లోని తన కార్యాలయంలో మండలంలోని పలువురు నాయకులతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ ప్రజాభిమానం చూగొన్నారన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో అన్ని మండలాల అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి బిజివేముల ఓబుల్ రెడ్డి, మండల జేసీఎస్ కో ఆర్డినేటర్ అక్కల రెడ్డి అంకిరెడ్డి, అనంతసాగరం సర్పంచ్ శోభ, సన్నపురెడ్డి రామిరెడ్డి పాల్గొన్నారు.

మంటల అలజడి



వ్యాపిస్తున్న మంటలు

సంగం: మండలంలోని జంగాలదొరువు చెరువులో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. గాలులకు ఆ మంటలు వేగంగా నీలాయపాళెం వైపు దూసుకురావడంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురయ్యారు. అప్పటికే మంటలతో నీలాయపాళెం సమీపంలో ఉన్న సుమారు 20 ఎకరాల జామాయిల్ తోట దగ్ధమైంది. మంటలు కొనసాగుతుండడంతో రైతులు, గ్రామస్తులు అగ్నిమాపక సిబ్బంది అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. గ్రామంలోకి మంటలు వ్యాపిస్తాయోమనని గ్రామస్తులు బిక్కుబిక్కుమంటున్నారు.

సంక్షేమ పథకాలు బంగారు భవిష్యత్‌కు బాటలు



స్థానికంగా ఉన్న సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద, బడుగు, బలహీనవర్గాల భవిష్యత్‌కు బంగారు బాటలుగా నిలుస్తాయని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మండలంలోని అల్లంపాడు పంచాయతీలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో గుర్తించిన రెవెన్యూ సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని మర్రిపాడు తహసీల్దారు ఆనంద రావుకు సూచించారు. వలంటీర్ల పనితీరును లబ్ధిదారులు అందరూ స్వాగతిస్తున్నారన్నారు. ఓ వైపు సంక్షేమ పథకాల పేరుతో ముఖ్యమంత్రి ప్రజలకు అందిస్తున్న ప్రోత్సాహకాలను తప్పుపట్టే పార్టీలు, నాయకులు తమ మేనిఫెస్టోలో వాటిని మరింత ఎక్కువగా అమలు చేస్తామని చెప్పడం తమ ప్రభుత్వానికి ప్రతిపక్షాలు సైతం ఇస్తున్న అభినందనలుగా భావిస్తామన్నారు. జగనన్న సంక్షేమ పాలనను 84 శాతం ప్రజలు కోరుకుంటున్నట్లు సర్వేల ద్వారా తెలుస్తుందని ముఖ్యమంత్రిగా రానున్న ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ తమ పార్టీ గెలిచి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మర్రిపాడు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులు నాయుడు, జేసీఎస్ కోఆర్డినేటర్ సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కోనంకి శ్రీనివాసులునాయుడు, ఎంపీటీసీ అబ్దుల్లా, సచివాలయ కోఆర్డినేటర్ మౌలాలి, నాయకులు గువ్వల వెంగళరెడ్డి, పేట శ్రీనివాసులురెడ్డి, పలు శాఖల అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పర్యావరణకు మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న దృశ్యం

దుత్తలూరు: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఉదయగిరి అటవీ రేంజ్ అధికారి తుమ్మల ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని నందిపాడు సచివాలయంలో పర్యావరణ సంరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం సచివాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. సర్పంచ్ హజరత్తమ్మ, సచివాలయ సిబ్బంది, ఫడ్స్ డైరెక్టర్ పీవీ రమణయ్య, అటవీ సిబ్బంది శ్రీనివాసులు, ప్రసాదు, ఓంప్రకాష్ పాల్గొన్నారు.

మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడుదాం

ఆత్మకూరు: ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడేందుకు కృషి చేద్దామని ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకట రమణమ్మ అన్నారు. సోమవారం మెప్మా ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. మెప్మా అధికారులు అంకయ్య, మాధవి, బేగ్, పలువురు ఆర్‌పీలు పాల్గొన్నారు.



ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న చైర్‌పర్సన్

మొక్కలు పెంచడం వ్యాపకంగా మార్చుకోండి

ఆత్మకూరు(అనుమసముద్రంపేట): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఇందుకోసం మొక్కలు పెంచి వాటిని సంరక్షించడం వ్యాపకంగా చేసుకోవాలని తహసీల్దారు రమణారావు అన్నారు. సోమ వారం నెహ్రూ యువకేంద్రం, హెడ్స్ స్వచ్ఛంద సంస్థ, యూత్ క్లబ్‌ల ఆధ్వర్యంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో మిషన్ లైఫ్ కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటారు. ఎంపీడీఓ ఎం భాస్కర్, హెడ్స్ సంస్థ నిర్వాహకుడు వి వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పులిమి వెంకట రమేష్‌రెడ్డి, ఏఓ శ్రీనివాస రావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

అల్లూరు: పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నగర పంచాయతీ కమిషనర్ ఫణికుమార్ తెలిపారు. సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిబ్బందితో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఏఈ వినోద్ పాల్గొన్నారు.

గిరిజనుల ఇళ్ల అక్రమ కొనుగోళ్లను అరికట్టండి

- కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆర్డీఓకు వినతి



ఆర్డీఓకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఆత్మకూరు: పట్టణంలోని వెంకట్రావుపల్లి గిరిజన కాలనీలో ఇటీవల కొందరు బయట వ్యక్తులు గిరిజనులకు అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చి వాటిని రాబట్టుకునేందుకు వారిని బెదిరించి వారి ఇళ్లను స్వాధీనం చేసుకుంటున్నారని, దీనిపై సమగ్ర విచారణ చేసి అక్రమ కొనుగోళ్లను అరికట్టాలని కులవివక్ష పోరాట సమితి, సీపీఎం నాయకులు ఆర్డీఓ సాధు కరుణకుమారికి వినతి పత్రం అందజేశారు. వెంకట్రావుపల్లి గిరిజన కాలనీలో సుమారు 13 ఇళ్లను ఆత్మకూరు, వెంకట్రావుపల్లికి చెందిన కొందరు వ్యక్తులు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు గిరిజనులకు అప్పులు ఇస్తున్నారని, తిరిగి చెల్లించలేని పక్షంలో వారి ఇళ్లను తమ పేరుతో కొనుగోలు చేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆత్మకూరు నాగయ్య, కె.డేవిడ్‌రాజు, గంటా లక్ష్మీపతి, ఎల్‌కే ప్రసాద్, మొలబంటి నాగేంద్ర పాల్గొన్నారు.

త్వరలో తలసేమియా సెంటర్ ప్రారంభం

- ఎమ్మెల్సీ, జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్
- ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాల ముగింపు
- సీనియర్ సభ్యులను సత్కరించిన ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



రెడ్‌క్రాస్ సేవకులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: కావలి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో త్వరలో తలసేమియా సెంటర్, హోమ్ నర్సింగ్ సేవలు ప్రారంభిస్తామని, తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ, జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి చెప్పారు. స్థానిక రెడ్‌క్రాస్ భవనంలో ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాల ముగిపు వేడుకలు సోమవారం జరిగాయి. ఈ సందర్భంగా 25 సంవత్సరాల నుంచి రెడ్‌క్రాస్ జీవిత సభ్యులుగా సేవలందిస్తున్న పలువురిని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాలకు చెందిన సేవానిరతి కలిగిన ప్రముఖ వ్యక్తుల సమ్మేళనం కావలి రెడ్‌క్రాస్ అని అన్నారు. కావలి రెడ్‌క్రాస్‌కు తన పూర్తి సహకారం అందించి, మరిన్ని సేవలు ప్రజలకు అందుబాటులోకి తెస్తానని చెప్పారు. కావలి రెడ్‌క్రాస్ ప్రారంభంలో ఉపాధ్యక్షులుగా వ్యవహరించిన కూరపాటి ఆదినారాయణరెడ్డి, పోషక సభ్యులు దామిశెట్టి శ్రీనివాసులునాయుడు, గంధం అంకమ్మ, డాకారపు లక్ష్మీ సరస్వతీదేవి, వేములపాటి మాధవరావు జీవిత సభ్యులు తుమ్మలపల్లి గోపాలకృష్ణమూర్తి, డాక్టర్ బండి వెంకటేశ్వర్లు, ఓరుగంటి వెంకటేశ్వర్లు, బచ్చు వీరాస్వామి, వేమూరు బాలకృష్ణమూర్తి, నందనవనం సీతాలక్ష్మీ, మొగిలిశెట్టి జమున, అన్నవరం సీతారామలక్ష్మీ, అన్నపూర్ణ, అమర నాగేశ్వరావు, పార్వతిశంకర్, హరినారపరెడ్డి, ఏల్చూరు వెంకటేశ్వర్లు, డాక్టర్ టి కృష్ణారావు తదితరులను జ్ఞాపిక, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వీకే శీనానాయక్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు డాక్టర్ బెజవాడ రవికుమార్, రవిప్రకాష్, సుధీర్ నాయుడు, ప్రసన్నాంజనేయులు, హనుమకుమార్, కనమర్లపూడి వెంకటనారాయణ, కనపర్తి రాజశేఖర్, రొటేరియన్ నల్లూరి రవికుమార్ పాల్గొన్నారు.

తల్లిలేని చిన్నారులకు విక్రమ్‌రెడ్డి చేయూత



రమాదేవి పిల్లల కోసం నగదు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మండలంలోని పెద మాచనూరుకు చెందిన ఆకుల రమాదేవి ఇటీవల పిడుగుపాటుకు గురై మరణించిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి సోమవారం ఆమె ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. రమాదేవి పిల్లలు పేరు మీద రూ.45 వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి వారి భవిష్యత్ అవసరాలకు వినియోగించుకోవాలని సూచిసూంచారు. సీఎం సహాయనిధి ద్వారా కూడా తగినంత పరిహారం అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే బాధితులకు హామీ ఇచ్చారు. గ్రామ పెద్దలు మండేది ఓబుల్‌రెడ్డి, నారసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు అధిక ప్రాధాన్యం



ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీఓ, డివిజన్ అధికారులు

ఆత్మకూరు: ప్రతి సోమవారం ఆర్డీఓ, మండలాల్లోని రెవెన్యూ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న స్పందన అర్జీల కార్యక్రమంలో అందే సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆత్మకూరు ఆర్డీఓ సాధు కరుణ కుమారి అన్నారు. అందిన ప్రతి సమస్యను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు ఆర్డీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ సుభద్ర, ఇరిగేషన్ ఈఈ ఆర్ వెంకటేశ్వర్లు, హౌసింగ్ డీఈ నటరాజ్, పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ జయచంద్ర, పీహెచ్‌సీ డాక్టర్ ఆర్ రాకేష్, ఐసీడీఎస్ సీడీపీఓలు జైనకుమారి, సునీలత పాల్గొన్నారు.

మర్రిపాడులో..

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు తహసీల్దారు కార్యాలయంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులు ఆధ్వర్యంలో సోమవారం జగనన్నకు చెబుదాం పేరుతో స్పందన కార్యక్రమం జరిగింది. తహసీల్దారు ఆనందరావు, ఎంపీడీఓ మస్తాన్‌ఖాన్‌తో పాటు ఎంఈఓ మాలకొండలరావు, ఏపీఓ సునీల్‌కుమార్, వెలుగు ఏపీఎం బుజ్జమ్మ, గృహనిర్మాణశాఖ ఏఈ రవి, వైద్యశాఖ అధికారి జావేద్, పశుసంవర్ధకశాఖ అధికారి స్వేత తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరురూరల్: గతంలో తహసీల్దారు మాత్రమే స్పందన వినతులు స్వీకరించి సంబంధిత శాఖలకు ప్రజావిజ్ఞప్తులను పంపేవారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించగా తహసీల్దారు లక్ష్మీనరసింహం, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, ఇరిగేషన్, హౌసింగ్, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు సురేష్‌బాబు, ఉదయ్‌భాస్కర్, వెంకటేశ్వర్లు, లావణ్య, నయోమి, ఐసీడీఎస్ ప్రతినిధులు రమణమ్మ, వ్యవసాయ శాఖ ఏడీఏ దేవసేన, వ్యవసాయ అధికారి కిషోర్‌బాబు, ఏఎస్‌డబ్ల్యూఓ బ్రహ్మానందం, పశువైద్యాధికారి కృష్ణ, వెలుగు ఏపీఎం వెంకమ్మ, ఈఓ ఆర్‌డీ ఉషారాణి, తదితరులు పాల్గొనడంతో అక్కడికక్కడే సమస్యలకు పరిష్కారం లభిస్తున్నట్లుంది.

అల్లూరులో..

అల్లూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించి అర్జీలను స్వీకరించారు. తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ శ్రీదేవి, కమిషనర్ ఫణికుమార్ అర్జీలను స్వీకరించారు. త్వరితగతిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

ఉదయగిరిలో..

ఉదయగిరి: ఉదయగిరి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమానికి నామమాత్రపు స్పందన లభించింది. మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులు హాజరుకావాల్సి ఉన్నప్పటికీ కొంత మంది మాత్రమే హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు రెడ్డి, ఎంఈఓ మస్తాన్‌వలి, ఇరిగేషన్ ఏఈ విక్రమ్, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి పి.లావణ్య పాల్గొన్నారు.

చేజర్లలో..

చేజర్ల: జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. తమ సమస్యలను పరిష్కరించాలంటూ సోమవారం చేజర్లలోని వైకేపీ కార్యాలయంలో తహసీల్దార్ శివకృష్ణయ్యను కలిసి అర్జీలు అందజేశారు. ఏఓ విజయలిత, వైకేపీ ఏపీఎం సుజన, ఏఓ శశిధర్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అనంతసాగరంలో

అనంతసాగరం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి పలువురు వచ్చి అర్జీలు ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రదీప్‌కు ఇచ్చారు. ఈ కార్యక్రమంలోఎంపీడీఓ మధుసూదన్‌రావు, ఏఓ శ్రీధర్‌రెడ్డి ఉపాధి హామీ ఏపీఓ దయాసాగర్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వరికుంటపాడులో..

వరికుంటపాడు: తహసీల్దార్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని తహసీల్దార్ అబ్దుల్‌హమీద్, ఎంపీడీఓ విజయభాస్కర్‌రావు నిర్వహించారు.

కలిగిరిలో..

కలిగిరి: కలిగిరిలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మూడు అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్ కళాధర్‌రావు, పీఆర్ ఏఈ రవీంద్రనాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మసూద్ అహ్మద్, ఇరిగేషన్ ఏఈ రమేష్, ఏపీఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

జలదంకిలో..

జలదంకి: తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో స్పందన కార్యక్రమాన్ని తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ శ్రీధర్‌బాబు నిర్వహించారు. గ్రామ స్థాయిలో సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు.

కొండాపురంలో..

కొండాపురం: మండల ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రతి సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ బొడ్డు అనూరాధ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని ఎంపీడీఓ బ్రహ్మయ్య నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కె. రవికుమార్, పీఆర్ఏఈ శ్రీనివాసులు, పీహెచ్‌సీ వైద్యాధికారి నసురుద్దీన్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ఆనం' స్థాయికి విమర్శలు సరికాదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: ఉమ్మడి రాష్ట్రానికి మంత్రిగా పనిచేసిన అనుభవజ్ఞుడు వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి తాను గెలిచిన పార్టీపై విశ్వాసం లేకపోగా, తల్లిపాలు తాగి.. చందాన విమర్శించడం సరికాదని ఆత్మకూరు వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు. పట్టణంలోని ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి కార్యాలయంలో సోమవారం పట్టణ పార్టీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్యల ఆధ్వర్యంలో విలేకర్లతో మాట్లాడారు. అనేక సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రజల మన్ననలు పొందిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి జగనన్నను విమర్శించడం ఆకాశం వైపు చూసి ఉమ్మి వేయడమేనన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలతో పలు రాష్ట్రాల మన్ననలు పొందడంతో పాటు ఆయా రాష్ట్రాలలో ఈ విధానం అమలు చేసేందుకు సిద్ధం అవుతున్న తరుణంలో వలంటీర్లను విమర్శించడం సబబు కాదన్నారు. రాజకీయ కుళ్లు తొలగించేందుకే ముఖ్యమంత్రి ఓసీ స్థానాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలను గెలిపించి పదవులు కట్టబెట్టతున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. దీనిని ఓర్వలేక కుయుక్తులతో కూడిన విమర్శలు చేయడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నట్లు తెలిపారు. చైర్‌పర్సన్ గోపారం వెంకట రమణమ్మ మాట్లాడుతూ ఎస్టీ మహిళలైన తాను జగనన్న ప్రభుత్వంలో వలంటీరుగా పనిచేస్తుండగా దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ఆశీస్సులతో తనకు మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిని కట్టబెట్టారని గుర్తు చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందరికి సమాన అవకాశాలు ఇస్తామని చెప్పిన మాట మేరకు తనకు ఈ అవకాశం దక్కిందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, షేక్ సర్దార్, ఐవీ రమణారెడ్డి, సొసైటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, నోటి వినయ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

కమనీయం.. కోటేశ్వరుని కల్యాణం

సంగం: మండలంలోని దువ్వూరులో జరుగుతున్న కోటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం శివపార్వతుల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. దేవదేవేరులైన పార్వతిదేవి, కోటేశ్వరస్వాములను వధువరూలుగా తీర్చి కల్యాణ మండపంలో ఆశీనులను చేశారు. వేద పండితులు చదలవాడ శివకుమారస్వామి విశేష పూలతో అలంకరించి వేద మంత్రోచ్చారణలతో అంగరంగ వైభవంగా కల్యాణం నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.

క్లుప్తంగా

నేత్రపర్వం.. రథోత్సవం



రథోత్సవంలో ఆత్మారామస్వామి

సంగం: మండలంలోని అన్నారెడ్డిపాళెంలో కొలువైన ఆత్మారామస్వామి ఆలయంలో జరగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయంలోని సీతాలక్ష్మణ సమేత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను రథంపై ఉంచి ఆశీనులను చేశారు. అనంతరం భారీ గజమాలలతో సుందరంగా అలంకరించారు. ప్రధాన అర్చకులు తొలుత ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గ్రామీణులంతా ఒక్కటిగా హరే రామ రామ అంటూ రథోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. రథం పురవీధుల్లో వస్తుండగా భక్తులు రథ చక్రాల కింద గుమ్మడి కాయలు ఉంచారు. కోరికలు నెరవేరిన కొంత మంది మిరియాలు రథంపై చల్లారు. భక్తులకు శీతల పానియాలు అందజేశారు.

దేవస్థానం హుండీ లెక్కింపు



హుండీ లెక్కింపు చేపడుతున్న వలంటీర్లు

దుత్తలూరు: మండలంలోని నర్రవాడ వెంగమాంబ పేరంటాలు దేవస్థానంలో సోమవారం దేవదాయశాఖ అధికారులు హుండీల లెక్కింపు చేపట్టారు. ఫిబ్రవరి 13 సోమవారం వరకు 3 నెలల 23 రోజులకు భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.14,85,551 వచ్చినట్లు ఆలయ ఈఓ ఉషశ్రీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వ్యవస్థాపక ధర్మకర్త పచ్చవ వెంకటేశ్వర్లు, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.సుధీర్‌కుమార్, రిటైర్ట్ స్టేట్‌బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ బృందం, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఏడీఏగా చెన్నారెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న చెన్నారెడ్డి

ఉదయగిరి: ఉదయగిరి వ్యవసాయ సబ్‌డివిజన్ కార్యాలయంలో కార్యాలయంలో పి.చెన్నారెడ్డి సోమవారం ఇన్‌చార్జి ఏడీఏగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఏడీఏ బాలాజీనాయక్ ప్రకాశం జిల్లా దర్శికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో సీతారామపురం ఏఓగా పని చేస్తున్న చెన్నారెడ్డిని ఇక్కడ ఇన్‌చార్జి ఏడీఏగా నియమించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి ప్రభుత్వ రైతు సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందేలా చూస్తానన్నారు. పచ్చిరొట్ట ఎరువులు అందుబాటులో ఉన్నాయని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎస్సైని సన్మానించిన వైఎస్సార్‌సీపీ నాయకులు



ఎస్సైని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ఉదయగిరి: ఉదయగిరి ఎస్సైగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కె.ఇంద్రసేనారెడ్డిని సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు గానుగపెంట ఓబుల్‌రెడ్డి, దాసరపల్లి సర్పంచ్ సయ్యద్ గౌస్‌మొహిద్దిన్, ఉప్పుటూరి హరి, దారపనేని చెన్నయ్య పాల్గొన్నారు.

'స్పందన' అర్జీదారులకు మజ్జిగ, భోజనం



మజ్జిగ, భోజనం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

కావలి: ప్రతి సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో జరిగే స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు కావలి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మజ్జిగ, భోజనం అందజేయడం అభినందనీయమని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ప్రశంసించారు. రెడ్‌క్రాస్ జీవిత సభ్యులు, ప్రముఖ మహిళా రక్తదాత గొట్టిపాటి నిర్మల సహకారంతో ఆర్డీఓ కార్యాలయానికి వచ్చిన స్పందన అర్జీదారులకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో చేపట్టిన మజ్జిగ, భోజనం పొట్లాలు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రెడ్‌క్రాస్ ప్రతినిధులు రవిప్రకాష్, సుధీర్‌నాయుడు, ప్రసన్న ఆంజనేయులు, కలికి పవన్‌కుమార్‌రెడ్డి రక్తకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.